నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,2 సెప్టెంబర్ 2024

జలదిగ్బంధనంలో జగనన్న కాలనీ

- ముంపు సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్సీ హరిప్రసాద్

గొల్లప్రోలు, మేజర్‌న్యూస్ : గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి తరచూ ముంపు సమస్య ఏర్పడటంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నాలుగురోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గొల్లప్రోలు పరిసర ప్రాంతాలలో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గొల్లప్రోలు జగనన్న కాలనీ, దేవి నగరం, సూరంపేట, దళిత వాడలు ఇలా లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకోవడంతో ఆదివారం పిఠాపురం శాసనసభ్యుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాలను ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్, పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు పలువురు జనసైనికులతో కలిసి ఈ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పిఠాపురం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పిల్లా శ్రీధర్, పిల్లా శివకుమార్, ప్రముఖ వ్యాపారవేత గొల్లపల్లి పెద్ద బాబి, బస్సా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, బుడంకాయల దొరబాబు, అక్కిరెడ్డి శ్రీనివాసు, కడారి తమ్మయ్య నాయుడు, మర్రి చిన్న, తలారి శ్రీనివాసు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మొగలి రాజా నాయుడు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ మిత్రమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మళ్లీ టిడిపి రూరల్‌లో ముసలం

- జనసేన పేరు లేకుండా పింఛన్ల పంపిణీ ఫ్లెక్సీ

- చంద్రబాబుకు మహిళానేత ఫిర్యాదు

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి ఆ నియోజకవర్గం కంచుకోట. నేడు పూర్తిగా బీటలు వారుతోంది. గ్రూపు రాజకీయాలు పెరిగిపోయాయి. ఓ సీనియర్ నేత వ్యవహార శైలి వివాదాలకు తావిస్తోంది. ఈ విషయం స్వయంగా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు వెళ్ళింది. దీనిపై విచారణ చేయాలని ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఆదేశించారు.

కాకినాడ రూరల్ ఒకప్పుడు టిడిపికి ఆధిపత్యం ఉన్న నియోజకవర్గం. ఈ నియోజకవర్గం నుంచి గత ఎన్నికలలో జనసేనకు టికెట్ కేటాయించారు. జనసేన అభ్యర్థి పంతం నానాజీ భారీ మెజార్టీతో గెలిచారు. గతంలో ఎప్పుడు టిడిపి, ప్రజారాజ్యం, కాంగ్రెస్ పార్టీలకి ఇంత మెజార్టీ రాలేదు. జనసేన ఎమ్మెల్యే నానాజీ పూర్తిస్థాయిలో కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఆయన తనయుడు రాజకీయాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో తెలుగుదేశం గ్రూపులు మరింత తలనొప్పిగా మారాయి. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు ఓ వర్గంగా ఉన్నారు. అదేవిధంగా పేరాబత్తుల రాజశేఖర్, వి.వై. దాస్ ఓ వర్గంగా ఉన్నారు. అయితే పూర్తిగా పార్టీ క్యాడర్‌ను వెంటబెట్టుకుని రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆరోగ్య విభాగం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు ఇలా ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వెళ్తున్నారు. ఇదిలా ఉంటే పిల్లి సత్తిబాబు, రాజశేఖర్, వి.వై. దాస్ గ్రూపు రాజకీయాలు పెంచుతున్నారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి కేవలం కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలో మాత్రమే నాయకులంతా పింఛన్ల పంపిణీకి వెళ్ళాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. అయితే గత మూడు నెలల నుంచి వరుసగా పింఛన్లు పంపిణీలో నాయకులు పాల్గొంటున్నారు. తమకేదో బిచ్చం వేసినట్లుగా

పింఛన్ సొమ్ములు చేతుల్లో పెట్టి ఫోటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో పెడుతున్నారంటూ లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగుల ఫోటోలు సోషల్ మీడియాలో పెడుతున్నారు. వారు ఇబ్బందికర పరిస్తితులు ఎదుర్కొంటున్నారని పలు ప్రజా సంఘాలు కూడా ఆరోపణ చేశాయి. దీనిపై పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసారు కూడా. సామాజిక భద్రత పింఛన్ అర్హత ఉండి తీసుకుంటున్నారు. కానీ వారి ఫోటోలను గ్రూపుల్లో పెట్టడం ఇప్పుడు వివాదంగా మారింది. ప్రతి నెల పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఫించన్ ఇస్తారు. ఆ ఫోటోలు ఎందుకు పెట్టడం లేదని కొత్త చర్చ మొదలైంది. రూరల్‌లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు పింఛన్ల పంపిణీలో 100కు పైగా ఫోటోలు అప్లోడ్ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇది కాకుండా పింఛన్లు పంపిణీకి సంబంధించి ఆయన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో ఎక్కడా ఎమ్మెల్యే, జనసేన పేరు లేదు. దీంతో జనసైనికులు కూడా ఒకవిధంగా ఆగ్రహంగా ఉన్నారు. మరోపక్క పార్టీలో చురుగ్గా ఉంటూ కార్యకర్తలను వెన్నంటి ప్రోత్సహిస్తూ జనసేనతో సమన్వయంతో ముందుకు తీసుకువెళ్లి పేద ప్రజలకు సహాయం అందిస్తున్న కటకంశెట్టి బాబీని అణగదొక్కాలనే ప్రయత్నాన్ని పిల్లి సత్తిబాబుతో కలిసి వి.వై.దాస్, రాజశేఖర్ చేస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పిల్లి సత్తిబాబుకు వ్యతిరేకంగా వి.వై.దాస్, రాజశేఖర్ ఎన్నికల ముందు వరకు పావులు కదిపారు. వారికి టికెట్ ఇవ్వవద్దని నేరుగా అధిష్టానంకు వీరే ఫిర్యాదు చేశారు. ఎన్నికలలో కూడా వీరు కలిసి తిరిగింది లేదు. ఎవరికి వారే యమునా తీరేగానే తిరిగారు. జనసైనికులు కష్టపడడం, ప్రజల్లో కూటమిపై సానుభూతి ఉండడంతో భారీ మెజార్టీ వచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే పిల్లి సత్తిబాబుకు టికెట్ ఇవ్వకపోవడంతో వారి అనుచరులు చంద్రబాబు, లోకేష్ ఫ్లెక్సీలు తగలబెట్టారు. జనసేనపై తీవ్రమైన ఆరోపణలు చేస్తారు. పిల్లి సత్తిబాబు వర్గానికి చెందిన కొందరు మాజీ కార్పొరేటర్లు చంద్రబాబును దూషిస్తూ బీసీలకు అన్యాయం చేసారని మీడియా సమావేశం కూడా నిర్వహించారు. తెలుగు మహిళ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలుగా పనిచేసిన నాగమణి ఇటీవల పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబును కలిసారు. పిల్లి సత్తిబాబు తనను ఎలా దూషించారో వెల్లడించడంతో దీనిపై విచారణ జరపాలని ఆయన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు సూచించారు. అదేవిధంగా గత నాలుగు రోజులుగా బాబీ వర్గం అమరావతిలోనే మకాం పెట్టింది.

రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న టిడిపి వైరి వర్గాల కుట్రలు, కుతంత్రాలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం మీద ఎవరికి వారే యమునా తీరేగా తెలుగు తమ్ముళ్లు వ్యవహరించడం, జనసేనతో కలుపుకొని వెళ్లకుండా విడిగా కార్యక్రమాలు నిర్వహించడంతో జనసేన కూడా వీరికి సమాచారం ఇవ్వడం మానేసింది. దీంతో పార్టీ రోజురోజుకు బలహీనపడుతోంది అనే ఆవేదన సీనియర్ కార్యకర్తల్లో మొదలైంది. ఎన్నికలలో తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీని ముందుకు నడిపించిన బాబి వర్గాన్ని చంద్రబాబు గుర్తించాలంటూ పలువురు నాయకులు బాబును కలిశారు. ఆయన నుంచి భరోసా లభించింది. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికేలా పిల్లి సత్తిబాబు, వి.వై.దాస్, రాజశేఖర్ వర్గాలకు క్లాస్ తీసుకోవాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం.

ధ్యానంతో అద్భుతమైన శాంతి

కాకినాడ, మేజర్ న్యూస్ : మనసు యొక్క నైపుణ్యాన్ని పెంచే గొప్ప సాధనం ధ్యానమని, రోజూ ధ్యాన సాధన చేయడం వలన అద్భుతమైన శాంతి అనుభవంలోకి వస్తుందని జ్ఞానదాత, పిరమిడ్ మాస్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల మినీ ఫంక్షన్ హాల్‌లో శ్రీ విశ్వ కాంతి పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ధ్యాన శిక్షణ, ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ధ్యాన సాధన వలన మన మనసును వీక్షించి ఆలోచనలను నియంత్రించే సత్తాను మనలో పెంచుతుందన్నారు. మన లోపల దాగివున్న అనంత శక్తిని బాహ్యపరుస్తుందన్నారు. వర్తమానంలో జీవించే సమర్థతను మనకు కలిగిస్తుందని అన్నారు. ఎల్లప్పుడూ ఆనందాన్ని ఆస్వాదించే ప్రజ్ఞను ధ్యానం కలుగజేస్తుం దన్నారు. ధ్యాన సాధనకు క్రమశిక్షణ, సాత్విక జీవన విధానం అవసరమని విజయలక్ష్మి తెలిపారు. అడబాల స్వర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కాకినాడ, మేజర్ న్యూస్ : రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఇండుగల ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ రాజకీయాలను ప్రక్షాళన చేయాలని, సుపరిపాలన అందివ్వాలని, ప్రజాసేవలో తరిద్దామనే ఆశలు, ఆశయాలతో పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారని అన్నారు. ఆ దిశగా ఇప్పటికే తన మంత్రిత్వ శాఖల పరిధిలో మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. గ్రంధాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఆశేష జనావళిని ప్రభావితం చేయగల వ్యక్తిగత ఆకర్షణ ఉన్న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలలో భాగంగా రోజుకొక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అడబాల ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్,కుమార్ యాదవ్, ఎస్.శ్రీనగేష్, పి.సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగష్టు నెలలో 292 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులపై, కాకినాడ పట్టణ ట్రాఫిక్ పోలీసు విభాగము కాకినాడ పట్టణం నందు రహదారి భద్రత ప్రమాణాలు పాటించి, ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో, నిరంతరం ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను బుక్ చేస్తోంది. ఆగస్టు నెల 2024 నందు కాకినాడ పట్టణ ట్రాఫిక్ విభాగం మొత్తం 292 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు చేసిన ముద్దాయిలను కాకినాడ, మూడవ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నందు ప్రవేశపెట్టగా, కోర్టు నందు వాదోపవాదనలు అనంతరం, ముద్దాయిలు నేరం చేసినట్లు రుజువు కాగా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు వారికి జైలు శిక్ష మరియు జరిమానాలు విధించడం జరిగినది. 292 మందిలో 75 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష విధించారు. 176 మందికి ఒక్కొక్కరికి రూ.10,000లు చొప్పున రూ.17,60,000లను కోర్టు జడ్జి జరిమానా విధించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్ విష్ణు, కాకినాడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్ మరియు కాకినాడ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బందిని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

ప్రకృతి పరిరక్షణ మొక్కలతోనే సాధ్యం

- పవన్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రకృతిలో వున్న జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి పౌరుని మీద వుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ (సత్య) పేర్కొన్నారు. పీపుల్స్ వరల్డ్ కమీషన్ ఆన్ డ్రాప్ట్ అండ్ ఫుడ్ (పిడబ్ల్యూసిడిఎఫ్) ఆధ్వర్యాన రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్ పిలుపు మేరకు ప్రెసింగి ఆదినారాయణ ఆధ్వర్యంలో డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జెఎన్‌టియు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నందు తొలుతగా జెఎన్‌టియు వైస్ చాన్సలర్ మురళీకృష్ణ ఛాంబర్‌లో ప్రకృతి రక్షణ మానవాళి సంరక్షణ అంశంపై చర్చా వేదిక జరిగింది. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న బొలిశెట్టి సత్య నారాయణ మొక్కను నాటి ప్రసంగించారు. పవన్ జన్మదినం పర్యావరణ పరిరక్షణకు అంకితంగా ఉండాలన్న ఆశయంతో డిసెంబర్ వరకు మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరం జరపాలన్నారు. పర్యావరణ ప్రాజెక్ట్‌పై నిరంతర అధ్యయనం, పౌర సేవ కొనసాగాలని సూచించారు. కాకినాడ ముంపునకు గురికాకుండా నివారణ కోసం యాక్షన్ ప్లాన్ అవసరం వుందన్నారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణవేత్తలు, పౌర సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళా సంఘాల టీమ్ లీడర్లు, పిడబ్ల్యూసిడిఎఫ్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

భాషా, సంస్కృతి రెండు కళ్ళుగా భావించాలి - మాజీ మంత్రి చిక్కాల

- ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కాకినాడ, మేజర్ న్యూస్ : తెలుగు భాష, సంస్కృతులకు ప్రపంచ స్థాయిలోనే ఒక గుర్తింపు ఉందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరాం కృష్ణ అధ్యక్షతన కాకినాడలోని రోటరీ క్లబ్ లో ఆదివారం ఉదయం తెలుగు భాష దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం ఏర్పాటయింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి చిక్కాల మాట్లాడుతూ తెలుగు భాష కోసం అందునా వ్యవహారిక భాష కోసం గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలను ఆయన కొనియాడారు. మాతృభాషను నేర్చుకోవాలని తద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలు కలకాలం సజీవంగా ఉండిపోతాయని ఆయన వెల్లడించారు. సభాధ్యక్షులు తోటకూర సాయిరాం కృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషను పరిపుష్టం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది అన్నారు. భాష వర్ధిల్లడానికి గురువుల కృషి వెలకట్టలేనిదని అన్నారు. మంచి సమాజాన్ని తయారుచేయడానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవ మరువలేనిదని గురువులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం వంటివారు ఆదర్శప్రాయులని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ బడే గోవిందరావు, సామాజికవేత్తలు డా. రాయవరపు సత్యభామ, డా. మానికిరెడ్డి సత్యనారాయణ, సైకాలాజిస్ట్ నందిక మహాలక్ష్మి కుమార్, డా. తురగా సూర్యారావు తదితరులు పాల్గొని తమ సందేశాన్ని అందించారు. అనంతరం పలువురు ప్రముఖులకు తెలుగు తేజం జాతీయ పురస్కారాలతోనూ కొంతమంది ఉపాధ్యాయులను మెరిటోరియస్ టీచర్ జాతీయ పురస్కారంతోను జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్నిచ్చి ఘనంగా సత్కరించారు.

పలు ప్రాంతాలలో గుంతలు పూడ్చివేత

- పోలీసువారికి, జెపి కన్‌స్ట్రక్షన్‌వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు మేరకు మరియు కాకినాడ సిడిపివో రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్, ట్రాఫిక్ ఎస్సై ఆర్.వెంకటరత్నం మరియు ట్రాఫిక్ 1 & 2 పి.యస్. అధికారులు మరియు సిబ్బంది కాకినాడ పట్టణంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్నా భారీ వర్షాలు సందర్భంగా, రోడ్లు బాగా పాడైపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మరియు సదరు గుంతలలో పడి కొంతమంది వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురి అవ్వుతున్నారని గమనించి జానకి ప్రభాకర్ కన్స్ట్రక్షన్ (జెపి కన్‌స్ట్రక్షన్) యాజమాని జె.ప్రభాకర్ ని మరియు పిడి రామకృష్ణని, గుంతలను పూడ్చుటకు సహకరించవలసిందని కోరగా వారు వెంటనే స్పందించి, అచ్చంపేట జంక్షన్ వద్ద, ఆనంద్ థియేటర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, బలరాం హోటల్ దగ్గర, న్యూ బ్రిడ్జి సెంటర్, జగన్నాధపురం ఓల్డ్ బ్రిడ్జి వద్ద మరియు చంద్రిక థియేటర్ వద్ద ఒక పెద్ద సిమెంట్ కాంక్రీట్ లారీ లోడు మరియు వారి సిబ్బందిని పంపించి పైన తెలిపిన ప్రదేశాలలో పడిన గుంతలను పూడ్చుటకు మాతో సహకరించారని కాకినాడ ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్ తెలిపారు.

న్యూ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ పోలీసువారు గుంతలను పూడ్చుట గమనించిన కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి కొండబాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీసువారికి మరియు జేపీ కన్స్ట్రక్షన్ వారికి అభినందనలు తెలియజేసినారు. సదరు ప్రదేశాలలో ప్రయాణం చేయుచున్న వాహనదారులు గుంతలు పూడ్చుట గమనించి, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని మరియు ట్రాఫిక్ పోలీస్ అధికారులను అభినందిస్తూ హర్షధ్వానాలు తెలియజేసినారని ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్ తెలిపారు.

యుద్ధం వద్దు - శాంతి కావాలి

- పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ చేస్తూన్న మరణకాండను ఆపాలని సిఐటియు డిమాండ్

- అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం నశించాలని నినాదాలు

కాకినాడ,మేజర్‌న్యూస్ : వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూ.ఎఫ్.టి.యు) ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన కాకినాడ మసీదు సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కలరాజకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కే.సత్తిరాజు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల ఇప్పటికి 40,000 మంది పాలస్తినా పౌరులు మరణించారని, ఇందులో మహిళలు, చిన్నపిల్లలే 20వేల మంది పైగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ సంస్థల లాభాలకు మూడవ ప్రపంచ దేశాలలో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ముడి సరుకు రవాణాకు అంతరాయం కలగడంతో పరిశ్రమలు నడవక నిరుద్యోగం పెరుగుతుందని, మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని విమర్శించారు. బిజెపి మతోన్మాద పార్టీ అధికారంలోకి రాగానే భారత అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలు ఇచ్చి గాజా ప్రజలపై జరిగే యుద్ధంలో ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేసి దేశప్రతిష్టను మంటగలుపుతుందన్నారు. ఇందుకోసమే భారత డిఫెన్స్ సెక్టార్‌ని ప్రేవేటికరణ చేసిందని గుర్తుచేశారు. అమెరికా, నాటో దేశాలు సిరియా, లిబియా, ఇరాక్ వంటి అనేక దేశాల్లో అంతర్యుద్ధాలను సమర్థిస్తూ ఆయుధాలు అందిస్తుందన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు చేతుల్లో పేలే ప్రతీ తూటా మేడ్ ఇన్ అమెరికా నుండి వస్తుందని గుర్తుచేశారు. ప్రపంచ కార్మికవర్గం ఈ సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించాలని, ప్రపంచ శాంతికై నిలబడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఏపీ.ఎం.ఎస్.ఆర్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, సిఐటియు రూరల్ కన్వీనర్ టి.రాజా, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు, అమరావతి మినీ గూడ్స్ యూనియన్ నాయకులు నాగరాజు, యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు చంద్రశేఖర్, ఎస్.ఎఫ్.ఐ. నాయకురాలు చెక్కల అమృత, వేణి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించండి

- కాకినాడ సిటీ ఎమ్మెల్యేకి సి.పి.ఎస్.ఉద్యోగుల వినతి

కాకినాడ, మేజర్ న్యూస్ : 2004 తర్వాత నియమితులయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు ను కలిసి కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీలు కల్పించి ఉద్యోగులను ఆదుకున్నారు అని, అదే విధంగా ఉద్యోగులకు రిటైర్మెంట్ పెన్షన్ కలిపించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను అన్ని రకాలుగా మోసం చేసిందని, వారంలో రద్దు చేస్తామని నాన్చుతూ చివరకు జి.పి.ఎస్. అంటూ మరో మోసపూరిత పెన్షన్ విధానాన్ని ఉద్యోగుల మీద రుద్దడం జరిగింది అని, ప్రశ్నించిన ఉద్యోగుల మీద కేసులు పెట్టి వేధించారని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జి.పి.ఎస్. విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గజిట్ నోటిఫికేషన్ రాకుండా నిలిపివేయడం ఉద్యోగులకు ధైర్యాన్ని ఇచ్చిందని ఉద్యోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో పాత పెన్షన్ మీద మరియు ఉద్యోగుల మీద పెట్టిన పోలీసు కేసుల మీద చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేని కలసినవారిలో జిల్లా అధ్యక్షులు ఎస్.కె.వి.బాషా, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు నూకరాజు, రాష్ట్ర కార్యదర్శులు చింతా నారాయణ మూర్తి, అలిమ్‌లు ఉన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమం, అనంతరం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్)" కార్యక్రమం నిర్వహించనున్నట్టు కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యల అర్జీలను అందజేయవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. అలాగే నగర ప్రజలు వారి ప్రాంతాల్లో సమస్యలు విన్నవించు కునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 18004255990ను కూడా వినియోగించుకోవచ్చని కమిషనర్ భావన తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో బండారు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన వాడపల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనందరావు లు కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం ద్వారా మాస్టర్ ప్లాన్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు అని అన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను కారణంగా పర్యాటక ప్రదేశాలు మూసివేత

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు అటవీ శాఖ డివిజన్‌లోని అన్ని పర్యాటక ప్రదేశాలను మూసివేసినట్లు చింతూరు డీఎఫ్ఓ బబిత తెలిపారు. చింతూరు అటవీశాఖ డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజ్‌లో గల పోల్లూరు జలపాతం, సోకలేరు వ్యూ పాయింట్లతో పాటు ఇతర సందర్శన ప్రదేశాలను మూసివేయడం జరిగిందని అన్నారు. ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాల్లో వరద నీరు ఎక్కువగా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలియజేశారు. అదేవిధంగా వాగులు, వంకలు,జలపాతాలు సందర్శించడానికి పర్యాటకులు ఎవరు రావద్దని వచ్చి ఇబ్బందులకు గురికావద్దని ఆమె తెలిపారు.

రుణాలను యువపారిశ్రామిక వేత్తలు సద్వినియోగించుకోవాలి

– కాకినాడ ఎం.పి. తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్

కాకినాడ,మేజర్న్యూస్ : భారతదేశ ఎగుమతుల్లో 45శాతం వాటకలిగి 15 కోట్ల మందికి ఉపాధికల్పిస్తున్న స్మాల్ & మీడియం స్కేల్ ఇండస్ట్రీస్ దేశానికి పట్టుకొమ్మలు అని అటువంటి చిన్నమధ్య తరగతి ఇండస్ట్రీలను ప్రోత్సహించేందుకు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణాలను యువపారిశ్రామిక వేత్తలు సద్వినియోగించుకోవాలని కాకినాడ ఎం.పి. తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్‌మండలంరమణయ్యపేట గ్రామంలో గల ఎ.పి.ఐ.ఐ.సి.ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో గల శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అసోసియేషన్ ప్రాంగణంలో స్మాల్‌ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజస్ క్లస్టర్ అవుట్ రిచ్ పోగ్రామ్ జరిగింది. కార్యక్రమంలోపాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యఅతిథి కాకినాడ ఎం.పి. తంగేళ్ళ ఉదయ్‌శ్రీనివాసుకు సిద్‌బీ సంస్థ ప్రతినిధులు శ్రీసత్యదేవ ప్రింటింగ్‌క్లస్టర్‌అసోసియేషన్‌మేనేజింగ్ డైరెక్టర్ బాలప్రసాద్, సభ్యులు పుష్పాగుచ్చాలు అందించిఘనస్వాగతంపలికారు. కార్యక్రమానికి సిద్‌బి డి.జి.ఎం విద్యాసాగర్ అధ్యక్షత వహించగా కాకినాడ ఎం.పి. తంగేళ్ళ ఉదయశ్రీనివాస్ ముఖ్యఅతిథిగాను సిద్ధబీ సి.జి.ఎం. సంజయ్ గుప్తా విశిష్ట అతిథిగాను, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, సిద్ధబీ జనరల్ మేనేజర్ చంద్రమౌళీ, ఎం.ఎస్. ఎం.ఇ. సి.ఇ.ఒ. మూర్తి, ఎ.పి.ఐ.ఐ.సి.జెడ్.ఎం.రమణరెడ్డి,డి.ఐ.సి.అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణార్జున్, శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ ఎం.డీ. కోరుమిల్లి బాలాప్రసాద్లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని కాకినాడ ఎం.పి. తంగేళ్ళ ఉదయ్ శ్రీ నివాస్ జ్యోతిప్రజ్వలన చేసిఅవుట్‌రిచ్‌పోగ్రామ్ ప్రారంబిం చారు. ఈ సందర్భంగా ఎం.పి. ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి ఎం.ఎస్.ఎం.ఇ. అవుట్ రీచ్ పోగ్రామ్ కాకినాడలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంజూరైన రెండు క్లస్టర్లలో మొట్టమొదటి క్లస్టర్ కాకినాడలో ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువ పారిశ్రామిక వేత్తలు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ అందిస్తున్న రుణాలను సద్వినియోగించుకుని దేశ అభివృద్ధిలో బాగస్తులు కావాలన్నారు. సిద్‌బి సి.జి.ఎం. సంజయ్ గుప్తా మాట్లాడుతూ దేశంలో పారిశ్రమిక అభివృద్ధి సిద్ధబీ అందిస్తున్న రుణాలను యువపారిశ్రామికవేత్తలు సద్వినియోగిం చుకోవాలన్నారు. శ్రీ సత్యదేవ ప్రింటింగ్ క్లబ్ అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కోరుమిల్లి బాలాప్రసాద్ మాట్లాడుతూ శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అభివృద్ధిలో సిద్ధబీ అందించిన సహాయ సహకారాల వల్ల త్వరితగతిన క్లస్టర్ను ప్రారంబించగలిగామన్నారు. అనంతరం సిద్ధబీ నుండి వచ్చిన అదికారులుఅవుట్ రిచ్‌పోగ్రామ్లోభాగంగా పారిశ్రామిక వేత్తలకు సిద్ధబీ అందిస్తున్న సబ్సిడి రుణాలను గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఆర్. మూర్తి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.రాజేష్, ఫణి పూర్ణ చంద్రరావు, కన్సల్టెంట్, చోడవరపు మూర్తి, సుంకర మాధవ్, జె.డి.ప వన్ కాకినాడ పరిసర ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రింటర్స్, యువ పారిశ్రామికవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

చింతూరు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండల కేంద్రంలో ఉన్న ఏరియా ఆసుపత్రిని ఆదివారం రాత్రి 8 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది. అదేవిధంగా డ్యూటీ డాక్టర్స్ ఎంతమంది ఉన్నారని వాకాబు చేయడం జరిగినది. తదుపరి హాస్పిటల్ పరిసరాలను ప్రాజెక్ట్ అధికారి స్వయంగా పరిశీలించి ఏరియా హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్న రోగులతో ప్రాజెక్ట్ అధికారి, నేరుగా వారితో మాట్లాడి వారికి అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మరియు రోగుల కోసం వంట వండుతున్న వంటశాలను పరిశీలించి శాశ్వతంగా వంటశాలను నిర్మించడానికి కావలసిన ప్రతిపాదనలను సంబంధిత శాఖ అధికారులను ఇవ్వవలసినదిగా ఆదేశాలు జారీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో పుల్లయ్య, డ్యూటీ డాక్టర్స్ మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగినది.

అపర్ణ అమ్మవారిని దర్శించుకున్న కాకినాడ డిఎస్పి

గొల్లప్రోలు,మేజర్న్యూస్: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఆదివారం అపర్ణ అమ్మవారిని కాకినాడ డిఎస్పి రఘువీర్ విష్ణు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి డిఎస్పి కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆకండి ప్రభాకర్ శాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ వేద పండితులు దైవజ్ఞరత్న ఆకొండి వెంకటేశ్వరశర్మ శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేదాలకు దిక్‌సూచి "జోతిష్యం" - పం.గుళ్ళపల్లి

కాకినాడ, మేజర్ న్యూస్ : సర్వ అంగాలకు నేత్రాలు ఎంతముఖ్యమో సర్వ వేదాలకు జోతిష్యం క్షక్షువని వేదాంత పండితులు గుళ్ళపల్లి శివశర్మ ఘనాపాఠి అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోవున్న శ్రీశంకర జోతిష్యాలయాన్ని వేదపండితులు ఆదివారం సందర్శించగా వీరందరికి జోతిషాలయ వ్యవస్థాపకులు వారణాసి రవికుమార్ దంపతులు ఘనంగా శాస్త్రోంగా స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వారివారి అహనికాన్ని ముగించు కుని వేదస్వస్తిని నిర్వహించారు, ఈసందర్భంగా పం.గుళ్ళపల్లి మాట్లాడుతూ జోతిష్యశాస్త్రం ఎంతో ముఖ్యమని వీటి ద్వారా భవిష్యత్తులో జరిగే విషయాలు ముందుగా తెలుసుకోవడం వల్ల వాటినుండి ఉపసమనం పొందాడానికి అవకాశం వుందన్నారు. భగవంతుని అనుగ్రహంతో జోతిష్యం మనకు ఋషులద్వారా అందించబడిదన్నారు. పంచాంగం మనకు దిక్‌సూచిగా పనిచేస్తుందని, ఎ సమయంలో ఏ కార్యక్రమము నిర్వహించడం ద్వారా సత్‌ఫలితాలు పొందగలమో మనకు తెలియపరుస్తుందని చెప్పారు. జోతిష్యం వల్ల సమాజ స్థితిగతులు మరియు సంరక్షణకు ఎంతో ఉపయోగపడే శాస్రమని అన్నారు. ఈ శాస్రంలో అన్ని విషయాలు వున్నాయని అన్నారు.పూలెపెద్ది లక్ష్మి నారాయణ ఘనాపాఠి, రేఖపల్లి శంకరమ్ ఘనాపాఠి, పెండ్యాల దత్తాత్రేయశర్మ ఘనాపాఠి, కపిలవాయి సురేంద్రశర్మ ఘనిపాఠి ప్రభుతులను వారణాసి దంపతులు సత్కరించారు.

వారణాసి రవికుమార్ మాట్లాడుతూ జోతిష్య ప్రపంచానికి సూర్యుడు వంటి డా.చెరుకుపల్లి లక్ష్మీనృసింహాశర్మ దగ్గర అధ్యయనం చేయడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. వీరి దగ్గర అనేకమంది అధ్యయనం చేసి నేడు దేశవిదేశాలతోపాటు తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ స్థానాలలో వున్నారని గుర్తుచేసారు. వేదాలు మరియు జోతిష్యశాస్రం అందరికి అందించాలన్న ఆశయంతో వేదవిజ్ఞాన ప్రతిష్ఠానం నెలకొల్పి ఉచితంగా ఈ వేదసంపదను భోదనరూపంలో అందిస్తున్నారని చెప్పారు.

మన్యంలో ఎడ తెలిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి,మేజర్న్యూస్: రంప చోడవరంమన్యంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టంజరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అలానేవిలీన మండలాల ప్రజలు మరింత అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లోఉండాలని మన మన్యం ప్రాం తంలో కొండ చరియలు విరిగిపడేఅవకాశాలు ఎక్కువగా ఉన్నం దున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో సుఖంగా ఉండాలనిఆమె విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో అధికార యంత్రాంగం ప్రజలను రక్షించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎకో ఫ్రెండ్లీ గణేష్

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : నగరంలోని జగన్నాధపురం చర్చి స్క్వేర్ సెంటర్ వద్దనున్న బాల గణేషా కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ లో ఆదివారం ఎకో ఫ్రెండ్లీ గణేశా కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 7 పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు మట్టి గణేషుని విగ్రహాలను తయారుచేసి తమ ప్రతిభ చాటుకున్నారు. ఈ పోటీల్లో విజేతలయిన విద్యార్థులకు వనమాడి మోహన్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్లాస్టర్ అఫ్ పారిస్‌తో చేసే విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంత హాని కలుగుతుందో వక్తలు వివరించారు. బాల గణేషా కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ లు మల్లిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ నేతృత్వం వహించగా కృపావతి, అకెళ్ళ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్, కోర్స్ కోఆర్డినేటర్ సబ్బవరపు విజయ తులసి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

కాకినాడ, మేజర్న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లాలో సోమవారం సెప్టెంబర్ 2వ తేదీన రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా కాకినాడ జిల్లాలో జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అట్టి ప్రకటనలో తెలిపారు.

నేడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలకు సెలవు

కాకినాడ, మేజర్ న్యూస్ : సెప్టెంబర్ 2వ తేది సోమవారం కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా కాకినాడ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ప్రభుత్వ శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు.

ఏఒక్క ప్రైవేట్ పాఠశాల, జూనియర్ కళాశాలలు కూడా నిర్వహించకూడదని, విధిగా సెలవును అమలు చేయాలని ఆయన కోరారు.

వైద్య పరీక్షలు నిర్వహించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

– ఐటిడిఏ పిఓ కట్టా సింహాచలం

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : ఏజెన్సీలోని గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించడంలో వైద్యులు అలసత్వం వహిస్తే సహించేది లేదని రంపచోడవరం ఐ టి డి ఏ పి ఓ కట్టా సింహాచలం హెచ్చరించారు. ఆదివారం మండలంలోని జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పి ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు పనితీరు, సిబ్బంది ఎంతమంది ఉన్నది, రోగులకు అందే వైద్యం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు తక్షణమే వైద్య చికిత్సలు చేసి మందులు అంద చేయాలని స్థానిక వైద్యులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలన్నారు. ఏజెన్సీలో కాలువలు దాటే ప్రజలు అపురమత్తంగా ఉండాలి:–బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసి కాల్వలు పొంగుతున్న సందర్భంగా ఏజెన్సీలో కాలువలు దాటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు.ఆదివారం గంగవరం మండలంలోని నెల్లిపూడి కాలువ,అడ్డతీగల మండలంలోని మద్దిగడ్డకాల్వ, పలుకురాతి పాలెం కాల్వలను పిఓ పరిశీలించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావం వల్ల భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ఏజెన్సీలోని కాలువలు ఎక్కువగా పొంగుతున్నాయని కాలువలు దాటే ప్రజలు వర్షాలు తగ్గే వరకు ఎట్టి పరిస్థితి లోనుకాలువలు దాటవద్దని ఆయన ప్రజలను కోరడం జరిగింది. కాలువలు దాటే ప్రాంతాలలో కొంతమంది సిబ్బందిని ఎక్కడికి అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వర్షాలు పడే సమయంలో ప్రజలు అవసరాన్ని బట్టి బయటికి రావాలని ఆయన కోరారు. పక్రతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉన్నామన్నారు.భారీ వర్షాలు సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోనూ, ఐటీడీఏ కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పి ఓవెంట ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, తాసిల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్ అల్లి సత్యనారాయణ, విఆర్వో భారతి తదితరులు ఉన్నారు.

అత్యవసరం అయితే తప్ప ప్రయాణించకండి

– ఎంపీపీ వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం అయితే తప్ప అధిక వర్షాలు కురుస్తూ ఉండండంవల్ల మండల ప్రజలు ఇంటినుండి బయటకు రాకుండా, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని. ఎంపీపీ గోము వెంకటలక్ష్మికోరారు. 3 రోజులనుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో లోతట్టు గ్రామాలులలో ఇళ్లలోకి నీరు చేరి, లబ్బర్థి పెద్దకాల్వ, నెల్లిమెట్ల చిన్న కాల్వ,శాంతినగర్, యర్రంపాడుకాల్వలు అలానే చేరుకు పాలెం, వాతంగి పాలకాల్వ. జి కొత్త పల్లి కాల్వలు అన్నీ ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప గ్రామాల్లోనే ఉండాలని ఆమె కోరారు. సోమవారం అన్ని యాజమాన్యం పాఠశాలలుకు ప్రభుత్వం సెలవు ప్రకటించినందున పిల్లలు తల్లి తండ్రులు విద్యార్థులుఆరోగ్యం పట్ల శ్రద్ధవహించవలచిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో వైద్యం నిమిత్తంవైద్య సిబ్బందిని,పారి శుద్యం కోసం పంచాయతీ సిబ్బంది ని అధికారులు అప్రమత్తం చేశారని ఆమె మీడియా ద్వారా తెలియజేయడమైనది.

కాకినాడలో 8 విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

– జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణకు పౌర సంక్షేమ సంఘం వినతిపత్రం

కాకినాడ, మేజర్ న్యూస్ : రెండేళ్లుగా కాకినాడ నగర పాలక సంస్థకు 13ఏళ్లుగా 8 విలీన గ్రామాలకు స్థానిక ఎన్నికలు లేకుండా నిర్వీర్యం అవుతున్నాయని, జనసేన రాష్ట్ర అధ్యక్షులు డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్థానిక పాలన కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోలిశెట్టి సత్య నారాయణ కాకినాడ పర్యటన సందర్భంగా స్థానిక జెఎన్‌టియులో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామాల విలీనం అంశం పంచాయతీ రాజ్ నుండి గ్రామాలను వేరు చేసిన ప్రక్రియ ప్రభుత్వ గెజిట్ గవర్నర్ ఆర్డినెన్సు తెదేపా ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్న ప్రభుత్వంలోనే జరిగాయని, ప్రభుత్వ ఆదేశాలు లేకుండా గ్రామ రికార్డులను వెనక్కి తీసుకువెళ్లిన ఘటనపై విచారణ లేకపోవడం వలన 48 డివిజన్లకే నగరం పరిమితమయ్యిందన్నారు. 50 డివిజన్ల మేరకు మార్పు చేసే అధికారం కార్పోరేషన్‌కు లేనందున విలీనంలో పెండింగ్ తొలగించి 65 డివిజన్ల విభజనతో కాకినాడ కార్పోరేషన్ ఎన్నికలు నిర్వహించే ప్రణాళిక అమలుచేయాలని కోరారు. పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు అందజేసిన వినతి పత్రాన్ని స్వీకరించిన బొలిశెట్టి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్థానిక పాలనలో ప్రగతికోసం ప్రాధాన్యత ఇస్తున్నారని, కాకినాడ జిల్లా కేంద్రం అభివృద్ధికోసం ప్రజల నిర్ణయాన్ని పార్టీ అజెండాలో చర్చిస్తారని పేర్కొన్నారు. ప్రజాహితంగా స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం వలన పరిష్కారాలకు తగిన సమన్వయం ఏర్పడుతుందన్నారు. నగర ప్రముఖులు ప్రెసింగి ఆదినారాయణ, పిల్లారిశెట్టి రాజేశ్వరి, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

అత్యవసరం అయితే తప్ప ప్రయాణించకండి

– సిఐ సన్యాసి నాయుడు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపద్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ ఎన్ సన్యాసి నాయుడు కోరారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీశ్ హడాహళ్లి పర్యవేక్షణలో మండల పరిధిలో వాగులు పొంగి పొర్లుతున్నందున రాజవొమ్మంగి సీఐ ఆధ్వర్యంలో వాగులు వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు,వాగులు దాటకుండా డ్రమ్స్ ఏర్పాటు చేసి ,కాషనరీ స్టికెర్స్ అతికించటం జరిగింది. ప్రజలు ఎవరూ కూడా పొంగి ప్రవహిస్తున్న వాగులు మీద కాలి నడకన,వాహనాల పై వెళ్లకూడదని, ప్రజలందరూ అప్రమత్తమై సురక్షతమైన ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని, వాగులలో చేపల వేటకువెళ్ళవద్దని సీఐ సన్యాసి నాయుడు తెలిపారు.రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మండల పరిధిలో ఎక్కడైనా రహదారులపై అడ్డంగా చెట్లు పడిన, వాగులు తెగిన పోలీస్ వారికి తెలియజేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకయ్య, సిబ్బంది ఉన్నారు.

భారతీయ జనతా పార్టీ బలోపేతానికి గ్రామ గ్రామాన సభ్యత్వ నమోదు

సామర్లకోట, మేజర్ న్యూస్ : భారతీయ జనతా పార్టీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహణకు సంబంధించి పెద్దాపురం నియోజకవర్గం సభ్యత్వ నమోదు ఇంచార్జ్ గొరకపూడి చిన్నయ్య దొర గారి ఆధ్వర్యంలో నాలుగు మండల అధ్యక్షులతో సమావేశం ఆదివారం ఏర్పాటు చేయడం జరిగింది. భారతీయ జనతా పార్టీలో 6 సంవత్సరాలకు ఒకసారి మొత్తం పార్టీ సభ్యత్వాలు రద్దుచేసి మళ్లీ నూతనంగా చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 04 తేదీన సాయంత్రం 5:30 నిమిషాలకు ప్రధాని నరేంద్ర మోదీ మొదటి సభ్యత్వం తీసుకోవడం జరుగుతుంది. తదుపరి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కొత్త జాయినింగ్స్‌తో కార్యకర్తల సమావేశం పెద్దాపురం తాపీ మేస్త్రీల యూనియన్ బిల్డింగ్ లో ఏర్పాటు చేయడం జరిగింది . ఈ సందర్భంగా గొరకపూడి చిన్నయ్యదొర మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి గ్రామ గ్రామాన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటుచేసి అధిక సంఖ్యలో సభ్యత నమోదు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అలాగే పార్టీలో జాయిన్ అయినా ప్రతి కార్యకర్తకి నేను,పార్టీ కూడా అండగా ఉంటామని ఆయన తెలియజేశారు.

భారీ వర్షాలు కారణంగా ఐటీడీఏ గ్రీవెన్స్ రద్దు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల వేదిక (గ్రీవెన్స్) భారీ వర్షాల కారణంగా రద్దు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదివారం తెలిపారు. రేపు జరగవలసిన ప్రజా సమస్యల వేదిక (గ్రీవెన్స్) భారీ వర్షాల కారణంగా రద్దు చేయడం జరిగిందని, అదేవిధంగా వర్షాల వలన ఏమైనా సమస్యలు ఉంటే దగ్గర్లో ఉన్న మండల అధికారులకు, రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియపర్చవచ్చునని ఆయన తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సమస్యలు తెలుపుకొనే దరఖాస్తుదారులు ఉప్పొంగుతున్న కొండ కాల్వలు దాటి ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రీవెన్స్ కు రావద్దన్నారు. అదేవిధంగా ఈ సోమవారం ప్రజా సమస్యల వేదిక (గ్రీవెన్స్) రద్దు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు.

వన్నెపూడిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : గొల్లప్రోలు మండల పరిధి వన్నెపూడి జంక్షన్ వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గళ్ళ చొక్కా ధరించి సుమారు 35 నుండి 40 సంవత్సరాలు వయసు గల ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. వన్నెపూడి విఆర్ఓ ఫిర్యాదు మేరకు ఈ మృతి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే గొల్లప్రోలు పోలీసులకు తెలియపరచాలని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

మంచి సేవలు అందించే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు

– ఏపిఓ సన్మాన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ప్రజలకు మంచి సేవలు అందించిన ఏ ఉద్యోగికైనా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని, అదేవిధంగా 30 సంవత్సరాలపాటు ప్రజలకు మంచి సేవలు అందించిన ఐటీడీఏ ఏపీవో జనరల్ సి.హెచ్.శ్రీనివాసరావు మంచి గుర్తింపు తెచ్చుకున్నారని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో ఏపీవో జనరల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు సేవ చేయడంలో శ్రీనివాసరావు ఎంతగానో కృషి చేయడం జరిగిందని అదేవిధంగా ప్రజలకు మంచి సేవ చేసిన ప్రతి ఉద్యోగికి ప్రజల్లో, సంబంధిత కార్యాలయాల అధికారులలో, సిబ్బందిలో మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఏజెన్సీలోని పనిచేయుచున్న అధికారులు సిబ్బంది గిరిజనులకు మంచి సేవలందించిన ఎడల శిరస్థాయిగా ఏ

ఉద్యోగికైనా మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. పదవి విరమణ చేయుచున్న రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను 1994 సంవత్సరంలో డిపిఓగా గిరిజన సంక్షేమశాఖలో జాయిన్ అవ్వడం జరిగిందని అదేవిధంగా సుమారు 30 సంవత్సరాలపాటు కె.ఆర్.పురం, భద్రాచలం, రంపచోడవరం ఐటీడీఏలలో పనిచేయడం జరిగిందని ఆయన తెలిపారు. నేను ఎక్కడ పని చేసినా ప్రజల కోసం పనిచేయడం జరిగిందని ఆయన తెలిపారు. నాకు ప్రతి ఐటీడీఏలో అధికారులు సిబ్బంది నన్ను ఎంతగానో ఆదరించారని, ఈ ఆదరణ నేను ఎన్నటికీ మర్చిపోనని ఆయన అన్నారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం వారు, ఐటీడీఏ పరిపాలన డి.ఎన్.వి. రమణ, కార్యాలయ సిబ్బంది, అధికారులు గజమాలతో శాలువా కప్పి సి.హెచ్. శ్రీనివాసరావు దంపతులను సత్కరించడం జరిగింది. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పదవి విరమణ చేయుచున్న సి.హెచ్. శ్రీనివాసరావు దంపతులకు శాలువాలతో పుష్పగుచ్చాలు అందజేసి సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పీహెచ్ఓ చిట్టిబాబు, ఏపిడీ ఉపాధి హామీ పథకం జి.శ్రీనివాసరావు, పిఎఓ ఎల్.రాంబాబు, ఏటీఎం ఎండి జి.శిరీష, గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, గిరిజన సంక్షేమ శాఖ సూపర్డెంట్ బి.కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, డి.ప్రభాకర్ రావు, చక్రధర్ బాబు, ఎంపిహెచ్ఓ పీటర్, యస్ఓటి ఐటీడీఏ పరిపాలన అధికారి డి.ఎన్.వి.రమణ, ప్రధానోపాధ్యాయులుబి.ఎస్.కుమార్, కె.ఆర్.పి. కుమార్, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట చిన్నారి కోడూరి సత్య చరిష్య వరల్డ్ రికార్డు

సామర్లకోట,మేజర్న్యూస్: ఇంటర్ నేషనల్ కర్ణాటిక్ మ్యూజిషియన్ & డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్య ంలో వారణాశిలో నిర్వహించిన రావణాకృత శివతాండవం వరల్డ్ రికార్డు కూచిపూడి నృత్య కార్యక్రమంలో పాల్గొన్న సామర్లకోట పట్టణంకు చెందిన కోడూరి సత్య చరిష్య పాల్గొని వరల్డ్ రికార్డు హెూల్డర్ మెడల్ ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా చి.సత్య చరిష్యకు తల్లి తండ్రులు కోడూరి సత్య శివ ప్రసాద్, రాణి లకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకా యల చినరాజప్ప, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ చైర్మన్ జి. అరుణ జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

సామర్లకోట జంక్షన్ మీదుగా వెళ్లే ఐదు రైళ్లు రద్దు

సామర్లకోట, మేజర్ న్యూస్ : భారీ వర్షాలు వరదలు కారణంగా సామర్లకోట జంక్షన్ మీదుగా వెళ్లాల్సిన గోదావరి గౌతమి లింక్ గరీబ్ రథ్ ఎల్టిటి రైళ్లు ఆలస్యంగా నడవడం జరుగుతుందని సామర్లకోట స్టేషన్ మేనేజర్ రమేష్ పేర్కొన్నారు. అలాగే సామర్లకోట జంక్షన్ మీదుగా విజయవాడ వైపు వెళ్లాల్సిన గోదావరి గౌతమి లింక్ గరీబ్ రథ్ ఎల్టిటి ఐదు రైళ్లను రద్దు కాబడినమని ప్రయాణికులు గమనించాలని తెలిపారు. రైళ్ల ఆలస్యం, రైళ్ల రద్దు సమాచారం నిమిత్తం 0884 2327010 నెంబర్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సమాచారం తెలియజేస్తారని ఆయన అన్నారు.

తామరాడలో గరుత్మంతుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు

కిర్లంపూడి, మేజర్ న్యూస్ : కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామి ద్వార పాలకుడు గరుత్మంతుడి విగ్రహావిష్కరణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణిదంపతులు హాజరయ్యారు. అనంతరం నెహ్రూ కుమార్తె అల్లుడు తోట సర్వారాయుడు సునీత దంపతులు తామరాడ మాజీ సర్పంచ్ గోకేడ రాంబాబు రూపలత సుదర్శన యాగం నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు తామరాడ మాజీ సర్పంచ్ అనుకూల శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యులు గోకేడ రాజా, గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న, హై స్కూల్ కమిటీ చైర్మన్ వెలుగుంటి శ్రీను, పంచాది నానాజీ పసుపులేటి శివ, పెద్దిరెడ్డి రాంబాబు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి

రంపచోడవరం,మేజర్న్యూస్ : మన్యంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండా లని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజ్ఞప్తి చేశారు. అల్ప పీడనం ప్రభావం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా విలీన మండలాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శిరీష దేవి సూచించారు. ముఖ్యంగా కొండ వాగులు పొంగుతు న్నందున ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎవరు ఇళ్ల నుండి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. మన్యం ప్రాంతంలోని పలు ఘాట్ రోడ్లులో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శిరీష దేవి కోరారు. భారీ వర్షాలు, వరదల కారణంగా నియోజకవర్గంలో ప్రజలకు సహాయం చేయడానికి ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే శిరీష దేవి సూచించారు.

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

–గుండాలఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి

ఎటపాక, మేజర్ న్యూస్ : రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి తెలిపారు. ఎవరు కూడా అనవస రంగా పొంగిపొర్లుతున్న నదులు వాగులు, వంకలు, బ్రిడ్జిల వద్దకు వెళ్ళరాదు అని, మీ ప్రయాణాలు వీలైనంత వరకు వర్షాలు తగ్గేవరకు వాయిదా వేసుకోగలరనీ, అత్యవసరం అయితే తప్ప ఇల్లు వదిలి బయటకు రాకూడదు అని, ఈ భారీ వర్షాలకు పిడుగులు పడే సూచనలు ఉన్న ందున ఆరుబయట, చెట్ల కింద ఉండరాదు అని, పశువులను కూడా బయటకు వదలకండి అని, అంతేకాకుండా ఎలక్ట్రిక్ వస్తువులు, తడి కరెంటు స్తంభాలతో జాగ్రత్తగా ఉండాలి అని ఆయన తెలిపారు. ఈ భారీ వర్షాల నేపథ్యంలో వాగులు వంకలు దాటడానికి ఎట్టి పరిస్థితుల్లో ప్రయత్నం చేయవద్దని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలి అని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేయడం జరిగింది.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

గొల్లప్రోలు,మేజర్న్యూస్ : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై పోలవరపు నూకమ్మ(55) అనే మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డులో నివాసం ఉంటున్న నూకమ్మ భర్త పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం బట్టలను ఉతికి ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన భార్య నూకమ్మ ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్తను కాపాడే ప్రయత్నంలో విద్యుత్ తీగను పట్టుకోవడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే కొప్పుకూలి మృతి చెందింది. మీటర్ నుండి వెళ్లిన విద్యుత్ వైరు బట్టలు ఆరు వేస్తున్న ఇనప వైరుకు తగలడంతో కరెంట్ పాసై ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదంలో నూకమ్మ భర్త క్షేమంగా బయటపడగా ఆమె మాత్రంమృతి చెందింది. నూకమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సెప్టెంబరు 2వ తేదీ సోమవారం "మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

– జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో కూడా ప్రజల నుంచి అర్జీల స్వీకరణ – కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : సెప్టెంబరు 2వతేదీ సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక – "మీకోసం" ద్వారా కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఇతర జిల్లాల అధికారు లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించ నున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నందు, అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలియచేశారు. ప్రజలకి స్థానికంగా అందుబాటులో ఉండి అధికారులు డివిజన్, మండల కేంద్రాలలో అర్జీలు స్వీకరించడం పరిష్కారం చేయనున్నట్లు, కావునా ప్రజలు ఈ మేరకు స్థానికంగా ఉండే అధికారులకి అర్జీలు అందచేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భారీ వర్షాలకు కూలిన పాత భవనం

– పిఠాపురం పట్టణ పరిధిలో శిథిలావస్థకు చేరిన పలు భవనాలు

– శిథిల భవనాలపై కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు

పిఠాపురం, మేజర్ న్యూస్ : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పిఠాపురం పట్టణం గోల్డ్ మార్కెట్ సెంటర్లో గల పాత భవనం కొంతమేర కూలిపోయింది. భవనం కూలిపోయే సమయానికి అక్కడ ఉన్న షాపులు తెరవకపోవడం, జన సంచారం పెద్దగా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పిఠాపురం మున్సిపల్ పరిధిలో కాలం చెల్లిన భవనాలు పదులు సంఖ్యలో ఉన్నాయి. కాలం తీరిన భవనాలపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. కాలం తీరిన భవనాల జోలికి మున్సిపల్ అధికారులు రాకుండా భారీ స్థాయిలో చేతులు తడుపుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు చేయి తడవడంతో... కాలం చెల్లిన పాత భవనాల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కూలిన భవన ప్రదేశానికి దగ్గరలో ప్రముఖ ఆలయం శ్రీపాద వల్లభ సంస్థానం ఉండడంతో పాటు గోల్డ్ మార్కెట్ ఏరియా కావడంతో నిత్యం వేలాదిమంది సంచరిస్తూ... రద్దీగా ఉంటుందని, అటువంటి చోట ఇలాంటి పాత భవనాలు మరికొన్ని ఉన్నాయని, వాటిపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

– ఆదిత్య ఉపకులపతి ఎం.బి.శ్రీనివాస్

గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మెగా బూట్ క్యాంప్ విజయవంతంగా నిర్వహిం చారు. యువతకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చే శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని పెంపొం దించుకోవడంలో చైతన్యవంతులు కావాలని ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎం.బి. శ్రీనివాస్ సూచించారు. ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మరియు హైదరాబాదుకు చెందిన ఆర్టెక్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల మెగా బూట్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠ్యాంశ అంశాల్లోనూ, శిక్షణలోను నేర్చుకున్న అంశాలు ఉన్నత ఉద్యోగ సాధనకు ఉపయోగపడాలని ఆయన కోరారు. వివిధ డొమైన్ల మీద శిక్షణ పొందుటకు మరియు సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడటానికి ఉపయోగపడే పలు అంశాలు ఉన్నత ఉద్యోగానికి వెలుగు బాట వేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎం.బి.శ్రీనివాస్, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ ఎం. రమేష్ లు సూచించారు. రెండు రోజుల శిక్షణలో చెప్పిన అంశములు మెదడుకు పదును పెట్టే విధంగా ఉన్నాయని తమకు ఎంతో ఉపయోగపడతాయని పలువురు విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాధిపతులు డాక్టర్ ఆర్. వి.వి.కృష్ణ, ప్రొఫెసర్. సి.హెచ్. జానకిదేవి, ఆర్టెక్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.చరణ్ దత్, ఆదిత్య విద్యాసంస్థల ఆర్టెక్ కోఆర్డినేటర్లు ఎస్.దుర్గాప్రసాద్ పి.భూపాల్ రెడ్డి, రవీంద్ర, ఆర్టెక్ ప్రతినిధులు ఆకుల గగన్, ఎల్.శ్రీశేష సాయికిరణ్, విజయ్ భాస్కర్ రెడ్డి వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సుమారు 350 మంది బీటెక్ విద్యార్థినీ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన కోట మున్సిపల్ కమిషనర్

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణ ప్రజలకు గత కొన్ని నెలలుగా మున్సిపల్ కుళాయిల నుండి పసరు రంగులో నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ఉండూరు రోడ్‌లో ఉన్న వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్ ను మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదివారం పరిశీలించారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో గౌరవ కౌన్సిలర్స్ మున్సిపల్ కుళాయిల నుండి పసురు రంగులో మంచినీరు సరఫరా పట్ల ప్రశ్నించిన విషయం విదితమే.పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప మంచి నీరు పసరు రంగులో రావడానికి గల కారణం ఏంటో అని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు .ఎమ్మెల్యే ఆదేశాలతో వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్ ను కమిషనర్ క్షుణ్ణంగా తిరిగి ప్రతి ఒక్కటి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆలం బ్లీచింగ్ సరైన పద్ధతిలో కలపాలని అక్కడున్న సిబ్బందికి తెలిపారు. అక్కడున్న నీటిని స్వయంగా కమిషనర్ త్రాగి పరిశీలించారు. అదేవిధంగా ఫిల్టర్ బెడ్ ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు.సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహించరాద అని సిబ్బందిని ఆదేశించారు. ఒకవేళ విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పదన్నారు.

కొండ వాగులు, చప్టాలపై రాకపోకలు బంద్

– పోలీసులు రక్షణ చర్యలు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ వాగులు, చప్టాలపై ప్రజలు రాకపోకలు సాగించడం ప్రమాదమని, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి సూచించారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేవీపట్నం మండలం వెలగపల్లి గ్రామం వద్ద ప్రధాన రహదారి లో ఉన్న వంతెన పైనుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో రంపచోడవరం అడిషనల్ ఎస్పి జగదీశ్ అడహల్లి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఇటువంటి వంతెనల పైనుండి ఎవరు ప్రయాణించకుండా అక్కడ పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి వంతెనకు ఇరు వైపులా వాహనాలు రాకపోకలు జరగకుండా చెక్క దుంగలను ఏర్పాటు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం అడిషనల్ ఎస్ పి జగదీశ్ అడహల్లి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని కాబట్టి ఎవరూ కాలువలు, వాగులు, చెరువులు వద్దకు వెళ్లోద్దని అదే విధంగా చేపల వేటకు వెళ్లకూడదని తెలియజేసారు.

దేవరపల్లి మండలం గంగోలు గ్రామంలో కలెక్టర్ ప్రశాంతి పర్యటన

– సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి

దేవరపల్లి, మేజర్ న్యూస్ : ఎటిగట్ల పటిష్టత, యర్నగూడెం – నిడదవోలు రహదారి మార్గంలో పునరుద్ధరణ పనులను వేగవంతం గా చేపట్టి ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకొని రావాలని, బలహీనంగా ఉన్న గట్ల వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చెయ్యాలనీ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. ఆదివారం గోపాలపురం నియోజక వర్గం దేవరపల్లి మండలం పల్లంట్ల , త్యాజంపూడి గ్రామంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తో కలిసి పర్యటించి ఏటి గట్లను, రహదారి మార్గం ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేస్తూ, గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎటిగట్లు తెగిపడడం, రహదారి మార్గంలో ప్రజల రవాణా కు ఇబ్బందులు గురి కావడం గమనించడం జరిగిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు మూడు రోజులు వర్షభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలహీనంగా ఉన్న గట్లు పంట పొలాలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలను చేపట్టాలన్నారు. ఇప్పటికే ఇసుక బస్తాలు వేసి గట్ల పటిష్టత చేపట్టి నట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు తగిన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. యర్నగూడెం – నిడదవోలు ప్రధాన రహదారి మార్గంలో పునరుద్ధరణలను వేగవంతం చేసి ట్రాఫిక్ నీ సాధారణ స్థితికి తీసుకుని రావడం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న గట్ల వద్ద రక్షణ గా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తాహసిల్దార్ కే. రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ రాహుల్ , ఎంపిడిఓ పి..ప్రభాకర రావు, తదితరులు ఉన్నారు.

సంక్షేమ వసతి గృహాల పరిశీలన

– కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో ఎస్.సి, ఎస్.టి., బి.సి., సాంఘీక సంక్షేమ, బిసి గురుకుల విద్యాలయ భవనాల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించాలని, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వాటిని తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని సూచించడంతో శనివారం రాత్రి పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఆర్ఐ వెంకటేష్, వీఆర్వోలతో కలసి వసతి గృహాలను, పరిసరాలను పరిశీలించారు. భవనాల పటిష్టత, ఎక్కడైన శ్లాబ్‌ల లీకేజిలు, గదుల తలుపులు, కిటికిలు, ప్రాంగణాల ముంపు, పరిస్థితిపై యంత్రాంగం పరిశీలించారు. పెద్దాపురం పట్టణంలో స్థానిక రామారావుపేటలో గల బిసి హాస్టల్, వరహాల య్యపేట, సుధాకాలనీలో గల హాస్టల్స్‌లను పరిశీలించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తహశీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పరిశీలనలో హెచ్.డబ్లూ.ఓలు రమేష్, విశాలాక్షి, శ్రీవల్లి, ఉమాదేవి, కెనెడి, తదితరులు ఉన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు హాస్టల్స్‌లో ఉన్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాండ్రకోటలో 7వ తేది నుండి 15వ తేది వరకు గణేష్ నవరాత్రి మహెూత్సవములు

పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్ : పెద్దాపురం మండలం, కాండ్ర కోట గ్రామంలో శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ఎదురుగా శ్రీ విజయ గణపతి 4వ నవరాత్రి మహెూత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించబడునని శ్రీ విజయగణపతి ఆలయ కమిటి సభ్యులు జోకా నానాజీ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖ రులతో మాట్లాడుతూ, ఈ వనరాత్రి మహెూత్సవాలలో జూనియర్, సీనియర్ విభాగాలలో మహిళా భజన పోటీలు కమిటి సభ్యులు జోకా నానాజీ ఆధ్వర్యంలో కమిటి సభ్యులు ఎలిశెట్టి కామరాజుు (భజన గురువులు), ఎనుగంటి రామకృష్ణ, పంచాది రామకృష్ణ (మాస్టార్) పర్యవేక్షణలో నిర్వహించబడునని ఆయన కమిటి సభ్యులు తెలిపారు. ఈ భజన పోటీలకు న్యాయ నిర్ణేతగా నీలం శ్రీనివా

వినాయక ఉత్సవాలకు పోలీస్ అనుమతి తీసుకోవాలి

– ఎస్ఐ వెంకయ్య

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఈ నెల 7 నుండి నిర్వహించే వినాయక ఉత్సవ ఏర్పాటుకు, పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ ఎస్ వెంకయ్య తెలి పారు. ఈ మేరకు ఉత్సవ కమిటీఆన్ లైన్‌లో సింగిల్ విండో విధానంలో మొబైల్ ఫోన్, సిస్టం ద్వారా హెచ్ టి టి పి ఎస్ :// గణేష్ ఉత్సవ్. ఎన్ ఈ టి వెబ్ సైటులో పూర్తి సమాచారం జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వీటితోపాటు పోలీసు శాఖ సూచనలు, సలహాల మేరకు మండపం నిర్వహణ, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్ఐ వెంకయ్య తెలిపారు.

కూనవరం మండలంలో అడుగంటిన ప్రాథమిక విద్య

– పట్టించుకోని అధికారులు

కూనవరం, మేజర్ న్యూస్ : స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా గిరిజన గ్రామాలలో విద్య అంద న ద్రాక్షల తయారైంది మండలంలో 65 పాఠశాలల ఉండగా 40 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. విద్యార్థులు దాదాపు నాలుగు వేల మంది గిరిజన విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు ఉపాధ్యాయులు లేక కొన్ని పాఠశాలలో మూతపడుతున్నట్లు తెలుస్తుంది గిరిజన ప్రాంతాల్లో సరైన విద్యా సౌకర్యం లేక గిరిజన బాలురు అనేక మంది అవస్థ పడుతున్నారు ప్రజా ప్రతినిధులు ఎవరు ప్రాథమిక విద్య పట్ల సరైన శ్రద్ధ చూపకపోవడంతో పరిస్థితిదారులగా ఉంది ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి ఉపాధ్యాయుల నియమించి ప్రాథమిక విద్యను బలవపైతో చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కోరుకొండ మండలంలో జెసి చిన్న రాముడు పర్యటన

– సంక్షేమ వసతి గృహం, ఈ పంట నమోదుపై ఆదేశాలు

కోరుకొండ, మేజర్ న్యూస్ : రైతులకు ప్రభుత్వపరంగా మేలు చేకూర్చే విధంగా కోరుకొండ గ్రామంలోని 707 ఎకరాల రెవిన్యూ ఖాతా గా ఉన్న సాగు విస్తీర్ణం భూమిని రైతుల వివరాలు ఆధారంగా ఈ పంట నమోదుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆదేశించారు. ఆదివారం కోరుకొండ మండలం లో కోరుకొండ, కాపవరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జెసి చిన్న రాముడు మాట్లాడుతూ, శిథిలావస్థకు, నివాస యోగ్యంగా లేని సంక్షేమ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనంలోకి తక్షణం తరలింపు చెయ్యాల్సి ఉంటుందని ఆదేశించారు. కాపవరం ఎస్సి బాలికల వసతి గృహం స్లాబ్ శిథిలావస్థకు చేరి ఉండడాన్ని క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా జెసి అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, మండల

ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి అటువంటి భవనాలు గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కలెక్టర్ వారి ఆదేశాల మేరకు 26 మంది బాలికలను సురక్షిత భవనంలోకి తరలించినట్లు అధికారులు తెలియ చేశారు. ఖరీఫ్ సీజన్లో సాగు వివరాలు ఈ పంట నమోదుకు సెప్టెంబరు 15 వరకూ మాత్రమే సమయం ఉందని జెసి ఎస్ చిన్న రాముడు తెలియ చేశారు. ఈలోగా కోరుకొండ గ్రామంలో రెవెన్యు ఖాతా గా ఉన్న 707 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సాగు భూమి ని రైతుల వివరాల జాబితా మేరకు "ఈ పంట " గా నమోదు కు రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలనీ పేర్కొన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో వెస్టు గొనగూడెం వద్ద రహదారి మార్గంలో భారీ వర్షాల కారణంగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు సక్రమంగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలనీ అధికారులకి సూచనలు ఇవ్వడం జరిగింది. జాయింట్ కలెక్టర్ వెంటా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు తాసిల్దార్ వి సుస్వాగతం వ్యవసాయ శాఖ ఏడి మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

కూనవరం, విఆర్ పురం మండలాల్లో ఐటిడి పిఓ ఎస్పి పర్యటన పర్యటన

కూనవరం, మేజర్ న్యూస్ : గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలు వరద పరిస్థితి అంచనా వేసేందుకు ఆదివారం నాడు కూనవరంలోని శబరి బ్రిడ్జి వద్ద ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ సందర్శించారు.

కంసాలిపాలెంలో కలెక్టర్ ప్రశాంతి పర్యటన

నిడదవోలు, మేజర్ న్యూస్ : భారీ వర్షాలు నేపథ్యంలో, విపత్తుల నిర్వహణ హెచ్చరికల దృష్ట్యా బలహీనంగా ఉన్న గట్లను పటిష్ఠం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం నిడదవోలు మండలం కంసాలి పాలెం గ్రామంలో సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాత్సవతో కలిసి పర్యటించి ఏటి గట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేస్తూ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు మూడు రోజులు వర్షభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, బలహీనంగా ఉన్న గట్లు పంట పొలాలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలను చేపట్టాలన్నారు. బలహీనంగా ఉన్న గట్ల వద్ద ఇసుక బస్తాలను వేయాలని, మార్గాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పునరావాస కేంద్రాలకు తరలిం చేందుకు తగిన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కంశాలిపాలెం గ్రామంలో బలహీనంగా ఉన్న గట్ల వద్ద రక్షణ గా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాత్సవ, తాహసిల్దార్ బి నాగరాజు నాయక్, ఇరిగేషన్ ఏఈ రాహుల్ తదితరులు ఉన్నారు.

గండి కొత్తగూడెం వెళ్లే రోడ్లో బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి

కూనవరం, మేజర్ న్యూస్ : కూనవరం మండలం పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేపాక ,ఆర్ ,అండ్, బి ,రోడ్డు నుండి గండి కొత్తగూడెం వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద వాగుకి గత 2018లో మొదలుపెట్టిన బ్రిడ్జి పనులు నేటికీ పూర్తి అవకపోవడంతో కొండరెడ్లు మరియు పూర్తిగా 100 శాతం గిరిజనులు నివసించే గ్రామం రవాణా సౌకర్యం లేక అంబులెన్స్ కూడా వెళ్లే పరిస్థితి లేక నరకయాతన అనుభవిస్తున్నా ప్రజలు, గత రాత్రి కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి దగ్గర చేయాల్సిన కాంక్రీట్ పనులు అధికారులు నిర్లక్ష్యంతో అసంపూర్తిగా పనులు నిలిపివేయడంతో పైన పోసిన గ్రావెల్ కొట్టుకుపోయి ప్రజలు నడవటానికే నాన తండాలు పడుతున్నారు. మరియు రేపాక ఆర్ ఎం బి రోడ్డు నుండి గండి కొత్తగూడెం వెళ్లే రోడ్డు సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్డుపై కంక రాళ్లు తేలి పోవడం వలన కనీసం మోటర్ సైకిల్ కూడా వెళ్లే పరిస్థితి లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అక్కడ నివసిస్తున్న గిరిజనులకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు అంబులెన్స్ రావాల్సి వచ్చిన రోడ్డును చూసి అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు గత రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుతో పాటు బ్రిడ్జి కూడా పూర్తిగా దెబ్బతిన్నది అప్రోచ్ పై ఉన్న గ్రావిల్ పూర్తిగా కొట్టుకుపోయినది కావున అధికారులు తక్షణమే స్పందించి ఆగిపోయిన బ్రిడ్జి పనులు పూర్తిచేసి, రోడ్డు పనులు కూడా మంజూరు చేయించి పూర్తిగా కొండ రెడ్లు గ్రామమైన గిరిజనలు నివసించే గండి కొత్తగూడెం గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాలని పెద్దా ఆర్కూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నాగమణి డిమాండ్ చేసారు, ఆ రోడ్డును బ్రిడ్జి పనులను ఆమె సందర్శించి గ్రామస్తులను కలిసిన బ్రిడ్జి పరిస్థితిని రోడ్డు పరిస్థితిని ఐటిడిపిఓ గారికి సంబంధిత డిపార్ట్మెంట్ వారికి తెలియపరుస్తానని ఆమె ప్రజలకు హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో కూనవరం మండలం గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య, వార్డ్ మెంబర్ పండా లక్ష్మణరావు, మండల సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు ఉయిక కన్నయ్య , గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

పెద్దాపురం డివిజన్‌లో వర్షపాతం వివరాలు

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురండివిజన్‌లోని11 మండలాలలో ఆదివారం ఉదయం8.30 నుండి సాయంత్రం 5.00 వరకు నమోదైన వర్షపాతాల వివరాలు. కోటనందూరు మండలం 2.4 మి.మీ., తుని 0.8 మి.మీ., రౌతులపూడి 1.6 మి.మీ., శంఖవరం 3.4 మి.మీ., ఏలేశ్వరం 3.2 మి.మీ., జగ్గంపేట 0.8 మి.మీ., కిర్లంపూడి 6.2 మి.మీ., ప్రత్తిపాడు 6.0 మి.మీ., తొండంగి 0.0 మి.మీ., పెద్దాపురం 0.0 మి.మీ.,గండేపల్లి2.8 మి.మీ.,వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ట్రిపుల్ ఐటి ఘటనలపై మంత్రి లోకేష్ సీరియస్

– నూజివీడు ఐటి డైరక్టర్‌ను తొలగిస్తూ ఆదేశాలు

– ముగ్గురు సభ్యులతో పర్యవేక్షక కమిటీ ఏర్పాటు

నూజివీడు,మేజర్న్యూస్:రాజీవ్‌గాంధీసాంకేతికవైజ్ఞానిక విశ్వ విద్యాలయం పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీలో కలుషితాహారం తిని పెద్దఎత్తున విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సీరియస్ గా తీసుకున్నారు. మంత్రి కొలుసు పార్థసారధి స్థానిక శాసనసభ్యులు కూడా కావడంతో నిరంతరంట్రిపుల్ ఐటిలోని పరిస్థితులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కాగా విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూజివీడు ట్రిపుల్ ఐటి డైరక్టర్‌ను ఆ బాధ్యతలనుంచి తప్పిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నూజివీడు ట్రిపుల్ ఐటి పర్యవేక్షణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. ఇందులో కాలేజి ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యశాఖ ఇన్ ఛార్జి చైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి సభ్యులుగా ఉంటారు.పర్యవేక్షణ కమిటీ ఈఅంశాలపై దృష్టిసారిస్తుంది. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ పాటించడం. పారిశుధ్యం,మెస్ పరిశుభ్రత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్అమలుచేయడం. విద్యార్థుల హాస్టల్‌లో మెరుగైన పారిశుధ్యం,నాణ్యతా ప్రమాణాలఅమలుకు చర్యలు తీసుకోవడం. నూజివీడు ట్రిపుల్ ఐటిలో అవసరాలకు అనుగుణంగా చిన్నచిన్న మరమ్మతులు చేయడం. లైంగిక వేధింపులకుసంబంధించినఫిర్యాదులపరిష్కారానికి అంతర్గతఫిర్యాదు కమిటీని ఏర్పాటు చేయడం, ఫిర్యాదుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండావేగంగా వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం. ప్రతి డిపార్ట్‌మెంట్ స్థాయిలో తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయడం ద్వారా డ్రగ్ ఫ్రీ,పొగాకు రహిత సంస్థల కోసం కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధం కావాలని మంత్రులు ఆదేశించారు. సమస్యల తక్షణ పరిష్కారానికి నిర్ణీత సమయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి నారాలోకేష్ పర్యవేక్షక కమిటీకి సూచించారు.

పొంగి ప్రవహిస్తున్న శబరినది, సాకిలేరు

– రెండు రాష్ట్రాల మధ్య స్తంభించిన రాకపోకలు – జలదిగ్బంధంలో 4 గ్రామపంచాయతీలు

చింతూరు, మేజర్ న్యూస్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శబరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో చింతూరు మండలానికి, వి.ఆర్.పురం మండలానికి రాకపోకలు బంద్ అయ్యాయి. చింతూరు మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలలోని సుమారు ఇరవై గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. చింతూరు-కుయగూర్ గ్రామాల మధ్య శబరి నది ఎగపోటుకు గురవడంతో 326 జాతీయ రహదారి ముంపుకు గురైంది. దీనివల్ల ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా శబరి పరివాహక ప్రాంతాన్ని ఐటిడిఏ పి ఒ అపూర్వ భరత్ ఆదివారం చూటూరు, ముకునూరు, ఏజి కోడేరు, ఉలుమూరు గ్రామాలను సందర్శించారు. కోడేరు -ఉలుమూరు గ్రామాల మధ్య వాగు పొంగి ప్రవహిస్తు వుంది.

దాని లోనుండి గిరిజనులు నడుస్తుండటం చూసి మానవత్వంతో తాను, సిబ్బంది కారు దిగి గ్రామస్తులను కార్లో ఎక్కించి వాగు దాటించారు. ప్రమాదకర సంఘటనలు జరక్కుండా ప్రతివాగు వద్ద ఇద్దరు పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచారు. ప్రతి వాగు వద్ద ఒక నాటు పడవని ప్రజలను అటు, ఇటు దాటవేయడానికి సిద్ధంగా ఉంచారు.

యుద్ధాలకు వ్యతిరేకంగా సిఐటియు నిరసన

పెద్దాపురం, మేజర్ న్యూస్ : అమెరికా, నాటో దేశాలు ఉసిగొల్పే యుద్ధాలను వ్యతిరేకించాలని ప్రపంచ శాంతికి కార్మిక వర్గం నిలబడాలని సిఐటియు పెద్దాపురం మండల కమిటి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలని ఆదివారం స్థానిక మెయిన్‌రోడ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పెద్దాపురం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలను ఉసిగొల్పే పనిలో అమెరికా, నోటో కూటమిలు ఉన్నాయని, దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకూంటు ఒక దేశాన్ని మరోక దేశం మీద రెచ్చగొట్టే పని అమెరికన్ సామ్రాజ్యవాదం చేస్తుందని, అన్నారు. దీనికి ఉదాహరణ ఇజ్రాయిల్ పాలస్తీనా మీద యుద్ధం చేయడం, ఉక్రెయిన్ రష్యా మీద యుద్ధం చేయడం, కనబడుతుందన్నారు. ఆయుధాలు అమ్ముకుని తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకునే ప్రయత్నం అమెరికా కొనసాగిస్తుందని తెలిపారు. యుద్ధం ఎక్కడ జరిగినా మొదటిగా నష్టపోయేది ఆ దేశంలో ఉన్న కార్మిక వర్గమేనని తెలిపారు. ఇజ్రాయిల్ పాలస్తీనా మీద యుద్ధం చేసి దాదాపుగా నలభైవేల మంది చిన్నపిల్లలు, మహిళలు చనిపోవడానికి కారణమయ్యిందని, హాస్పిటల్స్, పాఠశాలల మీద దాడులు చేసి, ప్రజలను చంపడం దారుణమైన పరిస్థితి అన్నారు. యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి కావాలని కార్మిక వర్గం నినదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్సు యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ, ఆదిరెడ్డి శ్రీను, కరణం అప్పారావు, నీలపాల కృష్ణ, ముమ్మన శ్రీను, పి.నాగు, జి.నాగబాబు, సుబ్బారావు, శ్రీను, వీరబాబు, ఎం.సూరిబాబు, ఎస్.శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, బి.సత్యనారాయణ, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అప్రమత్తంగా ఉండాలి

– పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలి

– వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్,ఎస్పీ, జెసి

నూజివీడు,మేజర్ న్యూస్: వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం నూజివీడు వెలమపేట, పెట్రోల్ బంక్, తిరు వూరు రోడ్డు లారీ యూనియన్ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి పర్యటించారు. తొలుత స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయబడిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ బాధితులకు ఏర్పాటు చేసిన వసతి, భోజన సౌకర్యాలను పరిశీలన చేశారు. వెలమపేట వరద నీరు వచ్చిన కారణంగా శిథిలావస్థలో వున్న గృహాల్లో ఉంటున్న కుటుంబాలను పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ వెలమపేటలోని ఇళ్లను పరిశీలించి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, శిథిలావస్థలోవున్న గృహాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు చేర్చాలని సంబంధిత రెవిన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలోవున్న గృహంలో నివసిస్తున్న సరోజిని అనే వృద్ధురాలిని వెంటనే పునరావస కేంద్రానికి రావాలని కలెక్టర్ కోరారు. ఒంటరిగా ఉన్న వారిని తప్పనిసరిగా పునరావాస కేంద్రానికి వచ్చేలా నచ్చజెప్పాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అక్కడ ఉన్న 7వ తరగతి చదువుచున్న టి.వివేక్, సిహెచ్ రమేష్ లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పలకరిస్తూ అధిక వర్షాలు పడుతున్నందున బయట తిరగవద్దని, ఇంటిలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. వారిని చదువుకుని ఏమిచేస్తారని ప్రశ్నించగా వివేక్ పైలెట్ అవుతానని చెప్పడంతో అయితే మనకొక పైలెట్ వస్తాడని చిరునవ్వుతో కలెక్టర్ అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ భారీవర్షాలు మూలంగా దెబ్బతిన్న ఇళ్ల వివరాలను వెంటనేపంపాలనిసంబంధిత అధికారు లను ఆదేశించారు.వీరివెంటనూజివీడుఆర్డిఓ వై.భవానీశంకరి ,మండల ప్రత్యేక అధికారి,ఉధ్యానశాఖ డిడి రామ్మోహన్, మున్సిపల్ కమీషనరు,స్థానిక రెవిన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి,మేజర్స్యూస్: జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్ లోనికి ఆదివారం రాత్రి 9 గంటల సమాచారం ప్రకారం ఇన్ ఫ్లో 9907 క్యూసెక్కులు గాను, ఔట్ ఫ్లో 9352 క్యూసెక్కులు గా ఉన్నట్లు ఎ. ఇ. ఇ. పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 348.50 అడుగులు గాను గొనెల వాగు బేసిన్ 348.08 అడుగులు గాను వుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టి.ఎం.సి.లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.859 టి.ఎం.సి.లుగా వుందని పరమానందం తెలిపారు.తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమైనది.

వరి పొలాలను పరిశీలించిన మంత్రి రామానాయుడు

పోడూరు,మేజర్న్యూస్ : మండలంలో పెనుమదం గ్రామంలో భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అక్కడ రైతులతోను మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో భారీవర్షాలు వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు గంట, గంటకు సమీక్షలుచేస్తూ ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని సహాయ చర్యలపై జిల్లా కలెక్టర్లకు, జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు.

అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకుని అల్పాహారం, భోజనం,మంచినీటి సరఫరా దరిద్రం మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. గోదావరి ఏటిగట్టు పటిష్టతకు ఇసుక బస్తాలను, సర్వేబాదులను, వేదురు తడికలు, అవసరమైన సామాగ్రిని సిద్ధం చేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో నెలలు నిండిన గర్భిణీ స్త్రీలను, దీర్ఘవ్యాధి గ్రస్తులను,బెడ్ రెస్ట్ తీసుకుంటున్న పేషెంట్లను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లోజాయిన్ చేయాలని ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెనుమత్స రామభద్రి రాజు,గొట్టు ముక్కల సూర్య నారాయణ రాజు,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా చంద్రబాబు 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్

టి.నర్సాపురం,మేజర్న్యూస్:టీ.నర్సాపురం మండలంలోని రాజ పోతే ఓపల్లి గ్రామంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్య మం త్రిగా 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసిన మాజీ జడ్పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పార్టీ తెలుగుదేశం నాయకులు జాస్ సుబ్బారావు గుండు శ్రీను దావులూరు మోహన్ కృష్ణ నక్కలపూడి రామచంద్ర కేసిన వెంకటేశ్వర రావు,గుమ్మంల అనిల్ గుమ్మల బాలరాజు,నక్కలపూడి రామచంద్ర రావు, దేవరపల్లి ప్రశాంత్,గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

టి.నర్సాపురం, మేజర్ న్యూస్: 1995 సెప్టెంబర్ 1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటి ఈ ఆదివారం నాటికి 29 ఏళ్లు పూర్తిచేసుకుని 30 ఏట అడుగుపె డుతున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి పలువురు తెలుగుదేశం నేతలు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల దేవిపేట గ్రామంలో రాష్ట్ర తెలుగు కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈకార్యక్రమంలో కృష్ణ మూర్తి,వడ్డే శ్రీను, పండు, వీరాస్వామి నాయుడు, వీరాజు,శ్రీను , వీరబాబు, కార్యక ర్తలు, నాయకులు పాల్గొన్నారు.